ప్రజాశక్తి

శుక్రవారం 29 ఆగస్టు 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కొరత ప్రచారం..

రైతుల్లో కలవరం

- ఎరువులకు డిమాండ్, కొరత రెండూ లేవంటున్న వ్యవసాయశాఖ
- జిల్లాలో 4,780 టన్నుల యూరియా నిల్వలు: జేడిఏ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తెలంగాణాతో పాటు రాష్ట్రంలోనూ కొన్ని జిల్లాల్లో యూరియా కొరత ప్రచారం ఇక్కడ రైతుల్లోనూ కలవరం రేపుతోంది. అక్కడ బారులు తీరిన రైతులను చూసి ఇక్కడా పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన రైతుల్లో పెరుగుతోంది. దీంతో ఇప్పటినుంచే కొందరు ఎరువుల కోసం దుకాణాలకు పోతున్నారు. అధిక ధరలకు యూరియాను కొనే ఆలోచనకు వచ్చారు. అయితే ప్రస్తుతం ఖరీఫ్ సాగు కూడా జిల్లాలో ఆశాజనకంగా లేదు. 20 శాతానికి మించి సాగు కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు సాగు పెరిగే అవకాశం ఉంది. అయితే రబీ సీజను కూడా వచ్చేస్తోంది. అక్టోబర్ నుంచి వరినాట్లు ముమ్మరంగా మొదలు కానున్నాయి. ఆ తర్వాత పొగనాట్లు కూడా వేస్తారు. ఆ సమయంలో యూరియా అవసరం ఉంది. ప్రస్తుతం సాగర్ ఆయకట్టులోనూ నారుమడులు పోస్తున్నారు. కొన్ని చోట్ల బోర్లు, బావుల కింద వరినాట్లు ▶ 2లో

బషీర్‌బాగ్ అమరవీరుల స్ఫూర్తితో

మరో విద్యుత్ పోరాటానికి శ్రీకారం

- అదానీ, అంబానీల ఏజెంట్‌గా చంద్రబాబు..
- 'ప్రతిజ్ఞా దినం' కార్యక్రమంలో వామపక్షాల పిలుపు

ఒంగోలులో ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్‌లో మరో విద్యుత్ పోరాటానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం వచ్చిందని వామపక్ష పార్టీలు స్పష్టం చేశాయి. విద్యుత్ సంస్కరణలు విరమించుకోకుంటే.. ప్రజాగ్రహంలో ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని నేతలు ఘాటుగా హెచ్చరించారు. ప్రకాశం భవన్ వద్ద గురువారం జరిగిన 'ప్రతిజ్ఞా దినం' కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు 25 ఏళ్ల క్రితం బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలను స్మరించుకుంటూ.. వారి స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు జి రమేష్, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎం ఎస్ సాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు జీతగాడిగా విద్యుత్ సంస్కరణలు తెచ్చిన చంద్రబాబు మరోసారి అదే దారిలో నడుస్తున్నాడని ▶ 2లో

బాపట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్షాల నాయకులు

ఎర్రజెండాలతో భూమిలోకి వచ్చిన పేదలు

ఎర్రజెండా చేతబట్టి..

భూమి కోసం కదిలిన పేదలు

▲ 8లో

'సిఐడి సీరియల్స్' చూసి..హత్య

- వడ్డీల వేధింపులు తట్టుకోలేకే 'సుబ్బాయమ్మ'ను హత్య చేశామన్న నిందితులు
- వివరాలు వెల్లడించిన సిఐ హాజరత్తయ్య

వివరాలు వెల్లడిస్తున్న సిఐ హాజరత్తయ్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ ద్వారా సిఐడి సీరియల్స్ చూసి శింగరాయకొండలోని అంబేద్కర్ నగర్ కు చెందిన ఒంటరి మహిళ చెరుకూరి సుబ్బాయమ్మను హత్య చేసినట్లు ముద్దాయిలు వెల్లడించారు. ఈ నెల 23న అంబేద్కర్ నగర్లోని మూడో లైన్‌కు చెందిన ఒంటరి మహిళ చెరుకూరి సుబ్బాయమ్మను ఇంటి వద్ద హత్య చేశారు. ఈ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ సిహెచ్.హజరత్తయ్య వెల్లడించారు. శింగరాయకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒంటరి మహిళ చెరుకూరి సుబ్బాయమ్మను టంగుటూరు మండలం, బుచ్చిరాజుపాలేనికి చెందిన నత్తల మమత, నత్తల మణికంఠ, మధుమాల మాధురి అనే ముగ్గురు ఆమె ముఖంపై దిండు పెట్టి హత్య చేశారు. నత్తల మమత, మాధురి తమ కుమార్తెల పెళ్లి చేసేందుకు అంబేద్కర్ నగర్లో నివాసముంటున్న, చేపల మార్కెట్ వద్ద బడ్డీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్న చెరుకూరి సుబ్బాయమ్మ వద్ద అప్పు తీసుకున్నారు. సుబ్బాయమ్మ వద్ద మమత రూ.80 వేలు, మాధురి రూ.50 వేలు అప్పుగా తీసుకున్నారు. దానికి సంబంధించి ప్రతిరోజూ మమత రూ.850, మాధురి రూ.600 చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. మమతకు, మాధవి వారం రోజుల నుంచి ఆరోగ్యం బాగాలేనందున ▶ 2లో

మరో విద్యుత్ పోరాటానికి శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

దుయ్యబట్టారు. కేంద్రం అండతో రాష్ట్రాన్ని ఆదానీ, అంబానీల అడ్డాగా మారుస్తున్నాడని ఆరోపించారు. ప్రతిపక్షం లో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్ట మని పిలుపుఇచ్చిన చంద్రబాబు, అధికా రంలోకి వచ్చి వాటినే అమలు చేయడం సిగ్గుచేటని విరుచుకుపడ్డారు. స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని ప్రభుత్వం స్పష్టంగా ఎందుకు చెప్పలేకపోతోందని ఆమె ప్రశ్నించారు. ఈ మౌనం వెనుక అదానీ, అంబానీ ప్రయోజనాలే ఉన్నా యని ప్రజలకు అర్థం అవుతోందని పేర్కొన్నారు. సూర్య ఘర్ పథకం పేరిట కోట్లాది రూపాయల డ్వాక్రా నిధులను మళ్లించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ యువగళం పేరుతో స్మార్ట్ మీటర్లు పగులగొట్టమని పిలుపునిచ్చిన చంద్రబాబు, లోకేష్‌వి నోళ్లా లేక తాటిమట్టలా? అని ప్రశ్నించారు రూ.1750 కోట్లతో అమెరికాలో అదానీతో ఒప్పందం కుదుర్చుకున్న జగన్‌ను జైలుకు ఎందుకు పంపలేకపోతున్నారు? అని ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ సర్కార్, జగన్ కలిసి ఆదానీకి అండగా నిలుస్తున్నా రని దుయ్యబట్టారు. దమ్ముంటే జగన్‌ను జైలుకు పంపండి అని సవాల్ విసిరారు.

సిపిఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ అదానీతో రూ.1750 కోట్ల ఒప్పందం రద్దు మంచిదా? మరోవైపు ప్రజలపై రూ.1.25 లక్షల కోట్ల భారం మంచిదా? అని ప్రశ్నించారు. 60 వేల విలువ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను జగన్ రూ.1.30 లక్షలకు, చంద్రబాబు రూ.1.40 లక్షలకు కొనుగోలు చేశారని, ఇది స్పష్టమైన దోపిడీ అని ఆరోపించారు. సిపిఎంఎల్ నాయకులు ఆర్ మోహన్ మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీకి భూములు అప్పగిం చేందుకు కరేడు గ్రామాన్ని పోలీసులతో అష్టదిగ్బంధనం చేయించడం ప్రభుత్వ తంతుగా దుయ్యబట్టారు. సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నా యని, ఈ విధానాలపై వ్యతిరేక ఐక్య ఉద్యమాలు సాగాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె.మాబు మాట్లాడుతూ భారతదేశంలో మొదటి విద్యుత్ సంస్కరణలకు ప్రయోగశాల ఆంధ్రప్రదేశేనన్నారు. 25 ఏళ్ల క్రితం 9 వామపక్ష పార్టీలు చేపట్టిన పోరాటం ఫలితంగా 20 ఏళ్ల పాటు విద్యుత్ ధరల జోలికి ఏ ప్రభుత్వమూ పోలేదని, ఇప్పుడు మళ్లీ అదే చరిత్ర పునరావతమవుతుందని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్ నారాయణ మాట్లాడు తూ గత పోరాట ఫలితంగా ప్రజలకు 20 ఏళ్లు ఉపశమనం లభించిందని అన్నారు. ఎన్నికల్లో ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పుడు మరోసారి సంస్కరణలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు.. చివరికి ఇంటి బాట బట్టడం ఖాయమని ఘాటు వ్యాఖ్య చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు రకాల విద్యుత్ భారాలు మోపిందని, ప్రజలను దోచుకోవడమే అజెండా అని ఆరోపించారు. తొలుత కార్యక్రమంలో జి ఈశ్వరయ్య రామకష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు నేతత్వంలో మరో విద్యుత్ ఉద్యమం చేపట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు ఎం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వి బాలకోటయ్య, కె రమాదేవి, సీనియర్ నాయకులు పమిడి వెంకట్రావు, సిపిఐ ఎంఎల్ నాయకులు ఎస్ లలిత కుమారి, న్యూ డెమోక్రసీ నాయకులు బి పద్మ, ఎల్ రాజశేఖర్, సిపిఐ నాయకులు శ్రీరామ్ శ్రీనివాస్, ప్రకాష్ రావు, సిపిఎం నాయకులు జి శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు,టి మహేష్ తదితరులు పాల్గొన్నారు. – నగరంలోని సత్యనారాయణపురం 60 అడుగుల రోడ్డులో, శ్రీనగర్ కాలనీలో విద్యుత్ అమరవీరులకు సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.వీరాస్వామి, సభ్యుడు డి దశరథరామిరెడ్డి, నగర కార్యదర్శివర్గ సభ్యుడు జీ రమేష్, ఎం సుబ్బారెడ్డి, జి.ఆదిలక్ష్మి, ధారా వెంకటేశ్వర్లు, టీ భక్తసింగ్ రాజు, ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నగర కమిటీ ఆధ్వర్యంలో..

– సిపిఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయం త్రం విద్యుత్ అమరవీరులకు నివాళులు అర్పించారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు సహా పార్టీ నాయకులు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో షేక్ పీర్ సాహెబ్, బివి రావు, ఆర్ శ్రీనివాసరావు, జబ్బర్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను రద్దు చేసే వరకు పోరు

బాపట్ల: విద్యుత్ ఛార్జీల వ్యతిరేక పోరాటంలో 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో బషీర్ బాగ్ వద్ద అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లు రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. గురువారం బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో స్మార్ట్ మీటర్లు రద్దు అయ్యే వరకు పోరాటం ఆగదని ప్రతిజ్ఞ చేశారు. గంగయ్య మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ ఛార్జీలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతాయన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ ప్రమాణం చేయించారు. బాపట్ల పాత బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మజుందార్, కొండయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి, బీఎస్పీ నాయకులు రాజారావు, సమాజ్వాది పార్టీ నాయకులు శ్రీనివాస రావు, సిపిఎం నాయకులు శరత్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

రైతుల్లో కలవరం

(మొదటిపేజీ తరువాయి)

మొదలయ్యాయి. అక్కడ ఇప్పుడు యూరియా అవసరం ఉంది. అయితే యూరియా కొరత ప్రచారం రైతుల్లో కలవరం రేపుతోంది. ఎరువుల కోసం పరుగులు తీస్తున్నారు. ముందుగానే తెచ్చి పెట్టుకుందామనే ఆలోచనకు వస్తున్నారు. అయితే ఇంకా వరినాట్లు మొదలు కానుందున ఎరువులకు డిమాండ్ లేదని, అదేవిధంగా కొరత కూడా లేదని జేడిఏ శ్రీనివాసరావు తెలిపారు. అక్టోబరులో ఎరువుల అవసరం బాగా ఉంటుందన్నారు. అందుకు తగిన ఇండెంట్లు పెట్టి తెప్పిస్తామన్నారు. జిల్లాలో ఈ నెలలో 2800 మెట్రిక్ అవసరం ఉండగా 4,780 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. ప్రస్తుతం దర్శి ప్రాంతంలో నాట్లు మొదలైన ప్రాంతాల్లోనూ, చెరువులు, బోర్ల కిందనాట్లు వేసే ప్రాంతాలకు యూరియాతో పాటు మిగతా ఎరువుల అవసరం ఉంది. అయితే నాట్లు మొదలైన గ్రామాల్లోకి ఎరువుల వాహనాలు వెళితే వాటిని కిందకు దించకుండానే రైతులు చుట్టుముడుతున్నారు. ఎరువుల కోసం బారులు తీరుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులూ నానా అవస్థలు పడుతున్నారు. ఎరువుల కొరత అనే ప్రచారం తీవ్రమైంది. ఎందుకంటే ఇప్పటికే యూరియా అవసరం ఉన్న చోట్ల దొరకడం లేదు. మనకూ ఇదే పరిస్థితి వస్తుందేమోనన్న సందేహాలు రైతుల్లో ఉన్నాయి. దీంతో ఇపుడు అవసరం ఉందా? లేదా? అనే దాన్ని పక్కనబెట్టి నాలుగు బస్తాలు తెచ్చుకుని ఇంట్లో పెట్టుకుందామనే ఆలోచనకు రైతులు వెళుతున్నారు. దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. ఎందుకంటే రైతులకు అవసరమైన జిల్లాల్లో సకాలంలో అందించలేకపోవడం. దీని ప్రభావం, ప్రచారం అంతటా వ్యాపించింది. ఏదేమైనా రైతులకు అవసరమైన యూరియాతో పాటు మిగతా ఎరువులను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

‘సిఐడి సీరియల్స్’ చూసి హత్య

(మొదటిపేజీ తరువాయి)

రోజువారీ డబ్బులు కట్టలేదు. దీంతో సుబ్బాయమ్మ తాను పంపించిన వ్యక్తులతో వ్యభిచారం చేయమని ఒత్తిడి తెచ్చింది. ఆరోగ్యం బాగా లేకపోయినా వ్యభిచారం చేయాలని తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో ఈ విషయం మమత కుమారుడు మణికంఠకు కూడా చెప్పింది. సుబ్బాయమ్మ వేధింపులు పడలేక ఆమెని ఎలాగైనా చంపి.. ఇబ్బందుల నుంచి బయటపడాలన్న ఆలోచనతో మమత సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ ద్వారా సిఐడి సీరియల్స్ చూశారు. అందులో ఉన్న నిందితుల ప్లాన్ల ఆధారంగా సుబ్బాయమ్మను చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే 23న సాయంత్రం 6 గంటల సమయంలో సుబ్బాయమ్మ మమతకు ఫోన్ చేసి తనకు వేడి చేసిందని, బెల్లం పాయసం తీసుకురమ్మని చెప్పింది. ఇదే అదునుగా భావించి.. పథకం ప్రకారం మమత ఇంట్లో పాయసం తయారు చేసి దానిలో మాధవి వాడే నిద్ర మాత్రలు ఎక్కువ మోతాదులో కలిపారు. ఆ పాయసాన్ని ఒక ప్లాస్టిక్ బాక్స్‌లో వేసుకొని మమత, మాధవి సుబ్బాయమ్మ ఇంటికి వెళ్లి సుబ్బాయమ్మకు తాపించారు. ఈ నేపథ్యంలో వారి మధ్య కట్టాల్సిన డబ్బుల విషయమై గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో మమత సుబ్బాయమ్మను నెట్టింది. మత్తులో ఉన్న సుబ్బాయమ్మ మంచంపై పడి మూలుగుతున్న సమయంలో మమత కొడుకు మణికంఠ వచ్చి.. సుబ్బాయమ్మ ముఖంపై దిండు వేసి గట్టిగా ఊపిరి ఆడకుండా నొక్కాడు. అదే సమయంలో మమత చేతులు పట్టుకొని ఉండగా మాధవి కాళ్లు పట్టుకొంది. అప్పుడు సుబ్బాయమ్మ ఊపిరాడక మృతిచెందిoది. ఆ తర్వాత ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న డబ్బులు, సెల్‌ఫోను, ఏటీఎం కార్డులను దొంగిలించి మణికంఠ పారిపోయాడు. మమత, మాధురీ పాయసం తెచ్చిన డబ్బాను కాలువలో పడేశారు. సిఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు ముద్దాయిలను జరుగుమల్లి అడ్డరోడ్డు దాటిన తర్వాత టంగుటూరుకు వెళ్లే సౌత్ అండర్ పాస్ వద్ద అరెస్టు చేశారు. ముగ్గురినీ కోర్టులో హాజరు పరుస్తామని సీఐ వెల్లడించారు. సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన సీఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్ఐ బి మహేంద్ర, ఏఎస్ఐ మొహిద్దీన్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిస్వామి, శ్రీను, కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సర్టిఫికెట్ పోయినది

పంగులూరు మండలం, చందలూరు గ్రామానికి చెందిన పెంట్యాల నితిన్ కుమార్ తండ్రి జగదీశ్వరరావు అను నాకు సంబంధించిన పదవ తరగతి మార్కుల లిస్టు పోయినది. ఆగస్ట్ 20వ తేదీ చందలూరు నుండి పంగులూరునకు బైకుపై వెళుండగా మార్గమధ్యంలో సదరు సర్టిఫికెట్ గల కవర్ పోయినది. దొరికినవారు దిగువ చిరునామాకు తెలియజేయగలరు.

పెంట్యాల నితిన్ కుమార్
తండ్రి జగదీశ్వర రావు
చందలూరు గ్రామం, జె పంగులూరు (మం)
బాపట్ల జిల్లా.
సెల్. 7095545194

నోటీసు

ఆర్డర్ 21 రూల్ 54 (IA)అఫ్ సి.పి.సి
మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P No : 17/2025
in
O.S No: 2/2025

Between :-
గొట్టిపాటి సురేష్ @ సురేష్ బాబు ...DHR
మరియు
ముప్వల సుబ్రమణ్యం .....JDR

To
ముప్వల సుబ్రమణ్యం S/o లేటు ఆంజనేయులు
డోర్ నెం. 12-31, పర్చూరు, బాపట్ల జిల్లా,

పై నంబరు గల EPని మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది.01-09-2025న ఉదయం 10.30ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గాని వకీలు గారి ద్వారా గాని పైకోర్టువారి ఎదుట హాజరయి మీ అక్షేపణలు తెలుపుకొనగలరు లేని యెడల మీ పరోక్షమున పిటీషన్ విచారించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ :-01-09-2025

ఇట్లు
యార్లగడ్డ వెంకటేశ్వరరావు
DHR తరుపు న్యాయవాది పర్చూరు
Cell No:-9985534996

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. 816/2025 in O.S. 183/2025

Between :
వుయ్యూరు ప్రసన్న లక్ష్మి ....వాది
మధ్య
వుయ్యూరు సాంబిరెడ్డి ... ప్రతివాది
టు :
వుయ్యూరు సాంబిరెడ్డి, తండ్రి : శ్రీమన్నారాయణరెడ్డి, చుండూరు గ్రామం, చుండూరు మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాలోను I.A. 816/2025 లోను మీకు శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు పంపవలసినదిగా శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 22-9-2025 తేదీకి వాయిదా వేసివున్నారు. సదరు వాయిదారోజు ఉదయం10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియపరచటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 22-9-2025

ఇట్లు
మాదినేని రామ్‌ప్రసాద్,
పిటీషనరు/వాది తరపు న్యాయవాది,
సెల్ : 9246469955.

వేలం ప్రకటన

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No : 68/2024
in
OS No : 62/2024

శ్రీపతి సుబ్బారావు .....DHR
V/s
కలకండ వెంకటరత్నం వగైరాలు .....JDR's

పై నెంబరు EP లోని JDR's వద్దనుండి రావలసిన Decree బాకీని రాబట్టుకొను నిమిత్తం, EP షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ది10-09-2025న ఉదయం గం 10:30 ని.లనుండి సాయంత్రం 5 గంటలలోగా బహిరంగవేలము వేయుదురు, వేలం నందు పాల్గొనదలచిన వారు పైతెల్పిన తేదీన పైకోర్టు నందు హాజరు అయి షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును అని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

షెడ్యూలు:-

Bapatla District (Old prakasam District) - Inkollu SRO- inkollu Mandal-Koniki village- S.No. 297, 319 - An Extent of AC 0-40 Cents-belonged to (Late) Kalakanda Basavaiah - lying in the hands of JDR's 1 to 4 situated with in the following boundaries:
East: Land belonged to Marella Ramainjanayulu
South: Land belonged to pelluri Hanumantha Rao
West : Land belonged to Govindam Govinda Rajulu
North: Land belonged to Gattu madhusudhanarao
DHR Value :- Rs 5,00,000/- per acre
Amin Value:- Rs 8,00,000 per acre
SRO Value:- Rs. 2,80,000/-
వేలం తేది :10-09-2025
ఫర్ధర్ హియరింగ్ :17-09-2025

ఇట్లు
కొల్లా నరేంద్ర కుమార్
DHR తరుపు న్యాయవాది పర్చూరు
Cell No :-9440638201

చెరువుమాన్యం కౌలు బహిరంగ వేలం ప్రకటన

లింగంగుంట గ్రామ పంచాయతీ
మద్దిపాడు మండలం - ప్రకాశం జిల్లా

తేది : 29-08-2025 న ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామ పంచాయతీ నందు చెరువు మాన్యం సర్వేనెం: 190లో గల ఎ.21.50 సెంట్ల వ్యవసాయ భూమి కౌలుకు బహిరంగ వేలం నిర్వహించుటకు 2025-26 సంవత్సరము నందు రబీ పంట కాలమునకు ఎ.21.50 సెంట్ల కు గాను రూ. 2,75,000 /- (అక్షరముల రెండు లక్షల డెబ్బై ఐదు వేలు మాత్రమే) పంచాయతీ మద్దతు ధర నిర్ణయించినారు. గౌరవ డివిజనల్ పంచాయతీ అధికారి, ఒంగోలు వారి అధ్యక్షతన కౌలువేలం నిర్వహణ తేది :06-09-2025 న ఉదయం 10-00 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు జరుగును.

వేలంపాటకు షరతులు :

1.సర్వే నెం.190 లో గల ఎ.21.50 సెంట్ల పొలములో గల భూమికి పొజిషన్లో (ఉన్నది ఉన్నట్లుగా) బహిరంగ వేలం జరుగును.
2.వేలంపాట లో పాల్గొనువారు ధరావత్తు రూ. 5000/- (అక్షరముల ఐదు వేల రూపాయలు మాత్రమే) డిపాజిట్ కట్టవలెను. ఈ మొత్తం హెచ్చు పాట పాడిన పాటదారునికి తప్ప మిగిలిన వారికి వేలం పాట పూర్తి అయిన తదుపరి తిరిగి ఇవ్వబడును.
3.వేలం పాట యొక్క కాలం వ్యవధి రబీ పంట కాలము 2025-2026 మరియు ఒక పంటకు మాత్రమే. లీజు కాలము రబీ పంట కాలం తదుపరి ఎటువంటి పరిస్థితులలో పొడిగించబడదు.
4. వేలంపాటలో పాల్గొను వారు లింగంగుంట గ్రామ పంచాయతీకి ఎటువంటి బాకీ ఉండరాదు. అట్లు బాకీ ఉన్న వారు ఈ వేలంపాటలో పాల్గొనుటకు అనర్హులు.
5.వేలంపాటలో హెచ్చు పాటదారుడు పాట పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీ వారికి తాను చెల్లించవలసిన మొత్తం బాకీలో సగం చెల్లించి రసీదు పొందవలెను. ఇంకనూ చెల్లించవలసిన మిగిలిన మొత్తం పాట జరిగిన నాటి నుండి 3 రోజులు లోపు చెల్లించవలయును. లేనిచో పాట రద్దు చేయబడును.
6.పాట మొత్తం నగదు చెల్లించిన తదుపరి హెచ్చు పాటదారుడే స్టాంపు పేపరు తెచ్చుకొని అగ్రిమెంటు చేయించుకొనవలెను.
7.వేలంపాటలో పాడిన మొత్తం కౌలు నగదును కట్టి అగ్రిమెంటు వ్రాయించుకొనని యడల భూమిలోనికి పోవుటకు వీలులేదు.
8.కౌలు కాలములో అతివృష్టి, అనావృష్టి వంటి ఎలాంటి విపత్తులు వచ్చినా లింగంగుంట గ్రామ పంచాయతీ కార్యాలయము వారికి ఎటువంటి బాధ్యత లేదు.
9.హెచ్చు పాటపాడిన పాటదారుడు పాట పూర్తి అయిన వెంటనే సగం నగదు చెల్లించనిచో డిపాజిట్ తిరిగి యివ్వబడదు.
10.ఎటువంటి కారణము లేకుండా వేలం పాట నిర్వహణకు, వాయిదా వేయు అధికారం గ్రామ పంచాయతీ వారికి కలదు.
11.వేలంపాటలో హెచ్చు పాట దారుడు నుంచి వారి డిపాజిట్ మొత్తం రూ. 5000/- తగ్గించుకొని మిగిలిన మొత్తం కట్టించుకొనబడును.

సం//
తూమాటి కళ్యాణి
పంచాయతీ సర్పంచ్, లింగంగుంట

సం//
ఎం.శ్రీదేవి
పంచాయతీ కార్యదర్శి, లింగంగుంట

వినాయక చవితి వేడుకల్లో విషాదం

- పూల కోసం వెళ్లి చెరువులో పడి ఇద్దరు విద్యార్థులు మృతి
- బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో ఘటన

ప్రజాశక్తి-బాపట్ల

వినాయక చవితి వేడుక్ల విషాదం నెలకొంది. పూల కోసం వెళ్లి ప్రమాద వశాత్తు చెరువులోని బురదలో కూరుకు పోయి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో చోటు చేసుకుంది.

వినాయక చవితి సందర్భంగా విద్యార్థులందరూ కలిసి చిన్న వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ విగ్రహాన్ని అలంకరించేందుకు కలువ పూల కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు పొన్నూరు మండలం రమణప్పపాలెం గ్రామానికి చెందిన సైకం నాగ

మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

భూషణం(17), సుద్దపల్లి శ్రీమంత్(15), మరో విద్యార్థి వెళ్లారు. నాగభూషణం, సుమంత్ పూల కోసం చెరువులోకి దిగారు. చెరువులోని బురదలో కూరుకుపోయాయి. ఒడ్డున ఉన్న విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి జరిగినే విషయం గురించి గ్రామస్తులకు తెలిపారు. వారి వెళ్లి చూసే సరికి అప్పటికే ఇద్దరు విద్యార్థులు మృతి చెందిఉన్నారు. మృతుడు సుద్దపల్లి

నాగ భూషణం(ఫైల్)

సుమంత్(ఫైల్)

సుమంత్‌ది ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం. పూండ్ల గ్రామంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. పూండ్ల గ్రామానికి చెందిన విద్యార్థి సైకం నాగభూషణం కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు నరేంద్ర వర్మ తమ సానుభూతి తెలిపారు.

పాఠశాలలకు క్రీడా ప్రతిభా అవార్డులు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

హాకీ లెజెండ్ ధ్యానచంద్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లాలో విజార్డ్ అఫ్ ది హాకీ ఈవెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సంతనూతలపాడు మండల పరిధిలోని మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. క్రీడా ప్రతిభా అవార్డులకు ఐదు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. కొనకనమిట్ల మండల గొట్లగట్టు జడ్‌పి హెచ్‌ఎస్ పాఠశాల ప్రథమ స్థానం, కనిగిరి మండలం గురవాజిపేట జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల ద్వితీయ స్థానం, శింగరాయకొండ మండలం పాకల జడ్‌పిహెచ్‌ఎస్ తృతీయ స్థానం, జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు జడ్‌పిహెచ్‌ఎస్ నాలుగవ స్థానం, కొత్తపట్నం మండలం ఈతముక్కల జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల ఐదో స్థానం ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ప్రస్తుతం పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్(పిఇ)/పిఇటిలు, గతంలో బదిలీ అయిన శారీరక విద్యా ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా పాల్గొనాలని డిఇఒ తెలిపారు.

రంగబాబును అభినందిస్తున్న నాయకులు

పిఎసిఎస్ చైర్మన్‌గా రంగబాబు

ప్రజాశక్తి-పిసిపల్లి, కనిగిరి : కనిగిరి పిఎసిఎస్ చైర్మన్‌గా అద్దంకి రంగబాబు, డైరెక్టర్లు సుబ్బయ్య, బారా ఇమామ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కనిగిరి ఎఎంసి చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ మాట్లాడుతూ కనిగిరి పిఎసిఎస్‌ను అభివద్ధి పథంలో నడిపించాలన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు రాచమల్లు శ్రీనివాస్ రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ కూడలి రోశయ్య తదితరులు తమ్ముళ్ల పిఎసిఎస్ రంగబాబు, డైరెక్టర్లుకు అభినందనలు తెలిపారు.

శశికళకు అభినందనలు

ప్రజాశక్తి-కురిచేడు : డిఎస్‌సి- 2025 పరీక్ష ఫలితాల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కురిచేడు చెందిన శశికళ ఎస్‌సి కేటగిరిలో జిల్లా మొదటి ర్యాంకును సాధించారు. శశికళ భర్త జాన్ బాబు ఉపాధ్యాయుడుగా చేస్తున్నారు. ఎస్‌సి కేటగిరిలో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన శశికళకు యుటిఎఫ్ మండల శాఖ అభినందనలు తెలిపారు.

శశికళ

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- పొదిలి

బైకులు ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని తలమల గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తలమలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గాలిముట్టి రమేష్, అదే గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్ భార్య మున్నంగి సృజన గాయపడ్డారు. క్షతగాత్రులు విధుల నిర్వహణ నిమిత్తం బైకు తలమల వెళ్తున్నారు. ఘటనా స్థలం వద్ద వెళ్లే సరికి వెనుక నుంచి వస్తున్న బైకు ఢీకొంది. దీంతో రమేష్, ఆమె భార్య సజన, నాగేంద్రబాబు అనే యువకుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పొదిలికి వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన రమేష్

గాయపడిన సృజన

గాయపడిన నాగేంద్రబాబు

జాళ్లపాలెంలో పోలీసుల దాష్టీకం

- మహిళలపై లాఠీఛార్జి అమానుషం
- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-కొండపి

చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే చట్ట వ్యతిరేకులుగా మారి ప్రజలపై దాడులు చేస్తుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ముఖ్యంగా మహిళలు తమకు రక్షణ లేదంటూ ఆక్రోశిస్తున్నారని మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. కొండపి మండలం పెదకండ్లగుంట పంచాయతీ పరిధిలోని జాళ్లపాలెంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ జాళ్లపాలెం గ్రామంలో ఉమ్మడి స్థలంలో గ్రామస్తులు సమస్యలను చర్చించేందుకు రచ్చబండ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. నీడ కోసం అక్కడ వేప చెట్టును పెంచుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలోని ఇరు వర్గాల వారు రచ్చబండ స్థలం విషయమై వివాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. దీంతో ఓ వర్గం వారు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. స్థల వివాదం కోర్డులో ఉండగానే రచ్చబండ అరుగును కూల్చి వేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకుల మెప్పుకోసమే సిఐ భారీ పోలీసు బందోబస్తు మధ్య అర్ధరాత్రి సమయంలో అరుగును కూల్చివేసినట్లు తెలిపారు. కూల్చి వేతను అడ్డుకొనేందుకు ప్రయత్నించిన వారిని సిఐ ఇష్టమొచ్చినట్లు దూషించినట్లు తెలిపారు. అంతేకాక లాఠీ ఛార్జీ కూడా చేసినట్లు తెలిపారు. లాఠీఛార్జీలు మహిళలతో అనేక మంది గాయపడినట్లు తెలిపారు. గాయపడిన వారు తీసుకెళ్లేందుకు వచ్చిన 108 వాహనాన్ని కూడా అడ్డుకున్నట్లు తెలిపారు. కేసును పక్కదారి పట్టించేందుకు 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు పూర్తి బాద్యత వహించి మంత్రి స్వామి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు.. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర నాయకులు డాకా పిచ్చిరెడ్డి, మండల కన్వీనర్ బచ్చుట కోటేశ్వరరావు, నాయకులు భువనగిరి సత్యనారాయణ, మండల మాలకొండయ్య, వేముల రమేష్, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైసిపి నాయకులు, కార్యక్తరలు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న జయచంద్రబాబు

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తిలోని భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం ఓ మహిళకు గురువారం రక్తదానం చేశారు. యర్రగొండపాలెం చెందిన వెన్న అంకాలమ్మ అనారోగ్యంతో ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు ఓ పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. దీంతో అంకాలమ్మ బంధువులు భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ నిర్వాహకులను సంప్రదించారు. క్లబ్ నిర్వాహకులు ఎస్‌సి, ఎస్‌టి రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ స్టేట్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ ఇల్లూరి జయచంద్ర బాబును ప్రోత్సహించి అంకాలమ్మ రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా అంకాలమ్మ కుటుంబ సభ్యులు క్లబ్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌ఐవి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

హెచ్‌ఐవి/ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపరాదని పంచాయతీ కార్యదర్శి కాశీనాయక్ తెలిపారు. మండల పరిధిలోని బి. నిడమానూరు గ్రామంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టిఐ అవుట్‌రిచ్ కార్యకర్త మల్లేశ్వరి మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలన్నారు. హెచ్‌ఐవి/ఎయిడ్స్ అంటువ్యాధి కాదన్నారు ఈ కార్యక్రమంలో ఎస్‌కె.మస్తాన్ వలి, వెల్ఫేర్ అసిస్టెంట్ భవాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

వధూవరులనుఆశీర్వదిస్తున్న తిరపతయ్య

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం లింగంగుంట్ల గ్రామంలో కొదమల బోయజ్, సంధ్యారాణి వివాహ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీసీసెల్ అధ్యక్షుడు మద్ది తిరుపతయ్య, వైస్ ఎంపిపి కొదమల బెంజిమెన్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, కోలా మత్తయ్య,కేతిరెడ్డి బాలకొండ రెడ్డి. వైసిపి నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆర్‌సిడిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మారెడ్డి శివరామిరెడ్డి

శివరామిరెడ్డి

ప్రజాశక్తి-కొండపి : రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండపి మండలం గుర్రప్పడి గ్రామానికి చెందిన మారెడ్డి శివరామరెడ్డిని నిమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మారెడ్డి శివరామిరెడ్డి మాట్లాడుతూ తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షుడుకి కృతజ్ఞతలు తెలిపారు.

అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమం

ప్రతిజ్ఞలో సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నేతలు

పామూరులో మాట్లాడుతున్న సిపిఎం నేత సయ్యద్ హనీఫ్

చీరాలలో ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

అమృతలూరులో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజలు మోయలేని విద్యుత్ భారాలు మోపుతున్నారని సిపిఎం, సిపిఐ నేతలతో పాటు ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన విద్యుత్ ఉద్యమ అమరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమాన్ని నిర్మించక తప్పదని వామపక్ష, ప్రజా సంఘాలు హెచ్చరించాయి. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరం ఆగస్టు 28న జరిగిన విద్యుత్ పోరాట అమరవీరులబు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు స్థానిక గడియార స్థంభం సెంటర్లో పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు అందే నాసరయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డికెఎం రఫి, సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, రైతు సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి షేక్ కాశిం, హరిబాబు, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పి రూబెన్, షేక్ నన్నేషా, బి కాశయ్య, నాని తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : విద్యుత్ ఉద్యమానికీ నేటికి 25ఏళ్లు పూర్తయిందని సిపిఎం నాయకులు జయంతిబాబు అన్నారు. అప్పటి ఉద్యమ స్ఫూర్తితో స్మార్టు మీటర్లను వ్యతిరేకించాలని అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి శ్రీకాంత్, కాకాని హరిప్రసాదు, రావెళ్ళ వెంకట్రావు, దాసరి ఆంజనేయులు, జి బసవపున్నయ్య, కాకాని సుబ్బారావు, గాదె నాగేశ్వరావు, వెంకటసుబ్బయ్య, అంకమ్మ, ఎన్ రామారావు, ఎలీషా పాల్గొన్నారు.

వెలిగండ్ల : స్థానిక బస్టాండ్ సెంటర్లో విద్యుత్ ఉద్యమంలో అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాయళ్ల మాలకొండయ్య, ప్రజా సంఘాల నాయకులు కండే బాలకృష్ణ, బాలు నర్సిరెడ్డి, అనిల్, అన్నపరెడ్డి తిరుపతిరెడ్డి, ఏసోబు, సామెల్, మౌలాలి, రూబేను పాల్గొన్నారు.

చెరుకుపల్లి : విద్యుత్ అమరవీరుల త్యాగాలు నిరూపమానమైనవని సిపిఐ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ అన్నారు. అమర వీరులకు నివాళులర్పించారు. సిపిఐ (ఎంఎల్) నాయకులు మద్రివాడ వెంకట్రావు మాట్లాడారు. సిపిఐ నాయకులు బండారు శ్రీనివాసరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు కోటేశ్వరరావు, ఓరుగంటి సూర్య ప్రభావతి, ఆటో యూనియన్ నాయకులు జి నాగరాజు, ఎం సురేష్, వై గోపి, ఎస్‌కె బాజ్జి, ఎం ప్రభాకరరెడ్డి, ఎం శ్రీనివాసరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

టంగుటూరులో ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

టంగుటూరు : విద్యుత్ అమర వీరుల చిత్ర పటానికి సిపిఎం నాయకులు టీ రాము, వేసుపోగు మోజెస్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. సిపిఎం నాయకులు ఎం యానాది, జి సాల్మన్, వెంకటేశ్వర్లు, డి తిరుమలరావు, కోదండరాం, కె శ్రీనివాస్, సురేష్, సిపిఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

పీసీపల్లి, కనిగిరి : విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా మరో ఉద్యమాన్ని కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిసి కేశవరావు అన్నారు. 2000 ఆగస్టు 28న జరిగిన విద్యుత్ పోరాటంలో అసువులు బాపిన ముగ్గురు వీరులకు స్థానిక సుగుణవతమ్మ హాస్పిటల్ సెంటర్‌లో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం కనిగిరి పట్టణ నాయకులు కె వెంకటమ్మ, ఆర్ ఏడు కొండలు, పి నరేంద్ర, కె శాంతకుమారి, బి ఆదిలక్ష్మి, నారాయణ, టోపీవలి, షమీల, వలి, నెహమ్మత్, చంటి, ఆడివయ్య పాల్గొన్నారు.

పామూరు : విద్యుత్ పేరుతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలకు తగిన బుద్ధి చెప్తారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. షేక్ ఖాదర్ బాషా అధ్యక్షతన జరిగిన విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉధ్యమ అమరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమంకు నాంది కావాలని అన్నారు. స్మార్ట్ మీటర్లు, సర్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ప్రజలపై భారాలు విరమించుకోవాలని, లేని పక్షంలో మరో విద్యుత్ ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా నాయకులు సయ్యిద్ మౌలాలి, సిపిఎం నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి, వెంకటేశ్వర్లు, ఎస్ పిచ్చి రెడ్డి, ఇస్మాయిల్, మస్తాన్, గౌష్ భాష, షేక్ అల్లా భక్ష్, మహాపీర, ఇమామ్, దేవరాజు, విఠల్ రావు, పిచ్చిరెడ్డి, సిపిఐ నాయకులు ప్రభాకర్ సుబ్బారావు, మస్తాన్‌రావు, మోహన్ పాల్గొన్నారు.

త్రిపురాంతకం : సిపిఎం నాయకులు జి రాజారామయ్య, సిపిఐ నాయకులు మల్లికార్జున అధ్యక్షతన విద్యుత్ అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి రఘురామ్, సిపిఐ నాయకులు దేవుళ్ల శ్రీనివాస్, వైటి ఆంజనేయులు, నాగమల్లేశ్వరి, నీలం జ్యోతి, గూడూరి నాగేశ్వరరావు, సి పవన్ కుమార్, ఎస్‌కె కాశీం, రవిచంద్ర, మహేశ్, బి కొండలు పాల్గొన్నారు.

దర్శిలో ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

దర్శి : స్థానిక గడియార స్తంభం సెంటర్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించారు. సిపిఎం నాయకులు తాండవ రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, ఆర్ కరుణానిధి, సిపిఎం నాయకులు కెవి పిచ్చయ్య, ఉప్పు నారాయణ, వెంకటేశ్వర్లు, రంగనాయకులు, లక్ష్మీ పద్మ, రంగమ్మ, జాను, ఆదినారాయణ, అంజిబాబు, యలమంద రెడ్డి, ఇత్తడి కోటయ్య, గర్నెపూడి జాను పాల్గొన్నారు.

కొండపి : మండలంలోని పెరిదేపిలో 'ప్రతిజ్ఞా దినం' నిర్వహించారు. సిపిఎం నాయకులు కెజి మస్తాన్, సిపిఎం కార్యదర్శి అంగల్లుర్తి విశ్రాంతి మాట్లాడారు. అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా మరో ఉధ్యమమం తప్పదని అన్నారు. కార్యక్రమంలో మల్లెల నల్లమ్మ, లక్కీ పొగ కవులమ్మ, లక్కీపోగు మరియమ్మ, మల్లెలు జయరావు, తాళ్లూరి బ్రహ్మయ్య, యేసు రాజు, అంగలకుర్తి ఇర్మియ, ఆదాము, అంగలకుర్తి పరిమళ, కె సారపు దయమ్మ, అంగల్లుర్తి సుభాషిని, అంగలగుర్తి మార్త, కె సుమలత, లెక్కింపు కోటేశ్వరి, కేసరపు జై కుమార్, లక్కీ పోగు వీరయ్య పాల్గొన్నారు.

చీరాల : బషీర్ బాగ్ కాల్పుల్లో అశువులు బాసిన విద్యుత్ అమర వీరులు స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలకు వామపక్షాలు, ప్రజాసంఘాలు పూనుకున్నాయని సిపిఎం కార్యదర్శి నలతోటి బాబురావు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం వసంతరావు, డి నారపరెడ్డి, ఎల్ జయరాజు, ఐవి ప్రసాద్, బి సుబ్బారావు, ఇమ్మనియేలు, సిపిఐ నాయకులు బత్తుల సామేలు, పైడియ్య, ప్రజా సంఘాల నాయకులు మాచర్ల మోహనరావు, చుండూరి వాసు, బలహీన వర్గాల సమైక్య నాయకులు గోసాల ఆశీర్వాదం, తాటిబోయిన లక్ష్మీప్రసాద్, శీలం వెంకటేశ్వర్లు, ఎన్ మోహన్ కుమార్ ధర్మా పాల్గొన్నారు.

మద్దిపాడు : విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తిగా ప్రతిజ్ఞ చేశారు. సిపిఎం నాయకులు ఉబ్బా ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బా రావు మాట్లాడారు. యు వెంకటేశ్వర్లు, కాశీం, కాకుమాను సుబ్బారావు, అయ్యన్న, హరిబాబు, చిన్న, బాబ్జీ పాల్గొన్నారు.

పొదిలి : స్థానిక జూనియర్ కళాశాల రోడ్డులో విద్యుత్ ఉధ్యమ అమరవీరులు రామకష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి 25వ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం కన్వీనర్ పిల్లి బాలనర్సయ్య, ఆరికట్ల శ్రీను, ఎస్‌కె కరీముల్లా, రామారావు, ఎస్కే మస్తాన్ వలి, ఎస్‌కే బాషా, యోగయ్య, నారాయణరెడ్డి, సిపిఐ నాయకులు పివి కొండయ్య, గొంగటి ఏసురత్నం, జెవివి నాయకులు బి దేవప్రసాద్, ప్రభుదాస్, శీను, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు

అద్దంకి : విద్యుత్ చార్జీల వ్యతిరేక పోరాటంలో అనేక మంది అమరులు అయ్యారని, స్మార్ట్ మీటర్లు రద్దు చేసేవరకు వామపక్ష పార్టీలు పోరాటాలు చేస్తుందని సిపిఎం కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో స్మార్ట్ మీటర్లు రద్దు చేసేవరకు పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నడుపుతుందని అన్నారు. ఈపాటికే చార్జీల మోత ప్రజలపై కూటమి ప్రభుత్వం అనేక రూపాల్లో మోపిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కెఎల్‌డి ప్రసాద్, మునిసిపల్ కార్మిక యూనియన్ నాయకులు పి ఆదాం, ఫ్రూట్ అండ్ వెండర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మార్టూరు : వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బషీరాబాగ్‌లో విద్యుత్తు ఉద్యమ కాల్పుల్లో మృతి చెందిన బాలస్వామి, సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామిలను స్మరించుకుంటూ స్థానిక సిఐటియు కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి విద్యుత్తు బారాలు స్మార్ట్ మీటర్లు, ట్రూ ఆఫ్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.వేల కోట భారం వేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వై రాంబాబు, బి హనుమంతరావు, బొడెంపూడి సూరిబాబు, ఎస్‌కె ఇబ్రహీం, రైతు సంఘం కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి, పి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమృతలూరు : విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో విద్యుత్ స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఉధ్యమించాలని సిపిఎం కార్యదర్శి బి ఆగస్టీను కోరారు. మండలంలోని కూచిపూడిలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్తు మృతవీరుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పిచారు. కార్యక్రమంలో పులివర్తి రాజు , చావలి రమేష్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : స్థానిక మాదాల అంజయ్య భవనంలో గోవిందరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు మాట్లాడారు. కరెంటు చార్జీలు తగ్గించాలని 2000లలో జరిగిన విద్యుత్ పోరాటంలో మృతి చెందిన అమరులకు నివాళులర్పించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అదే స్ఫూర్తితో ఉధ్యమించాలని కోరారు. కార్యక్రమంలో మాదాల అంజయ్య, తన్నీరు గోవిందరాజులు, ఎర్రం గోవిందరాజులు, ఎర్రం గోవిందరెడ్డి, కస్సుర్తి గంగయ్య, రంగారావు పాల్గొన్నారు.

వైపాలెంలో మాట్లాడుతున్న సిపిఎం నేత డి సోమయ్య

యర్రగొండపాలెం : సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో స్థానిక పూల సుబ్బయ్య విగ్రహం విద్యుత్ అమర వీరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి సోమయ్య మాట్లాడారు. విద్యుత్ సంస్కరణలు ఉపసరించాలని ప్రతిజ్ఞ చేశారు. సిపిఎం నాయకులు షేక్ అమీర్ బాషా, ఎస్‌కె హిదయతుల్లా, టి అంజి, కోటేష్, కొండయ్య, డి నాగుల మీరా, ఎం వెంకటయ్య, సిపిఐ నాయకులు కృష్ణ గౌడ్, టిసిహెచ్ చెన్నయ్య, సాంబశివరావు, వీరయ్య, యోగయ్య పాల్గొన్నారు.

ముండ్లమూరులో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ముండ్లమూరు : విద్యుత్తు అమరవీరులకు సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, సిపిఎం కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతరావు, సత్యం వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, హనుమయ్య, తిరపయ్య, ఇర్మియ, శీను, ఏలియా, సుబ్బారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

మేదరమెట్ల : విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం కార్యదర్శి ఎం ఆంజనేయులు అన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, వై రవీంద్రబాబు, ఎం శ్రీనివాసరావు, ఎం పెద్ద సుబ్బారావు, జె యోహాన్ పాల్గొన్నారు.

కనిగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం నాయకులు

పొదిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష ప్రజా సంఘాల నాయకులు

మార్టూరులో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



మేదరమెట్లలో మాట్లాడుతున్న ఎం ఆంజనేయులు

ముండ్లమూరు, తాళ్లూరు మండలాలను

ప్రకాశం జిల్లాలోనే ఉంచాలి..

అఖిలపక్ష నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-ముండ్లమూరు, తాళ్లూరు

మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమనే ప్రచారం ముమ్మరం కావడంతో పలు ప్రాంతాల్లో పలు డిమాండ్లు ముందుకొస్తున్నాయి. నూతనంగా ఏర్పాటు చేయబోయే మార్కాపురం జిల్లాలో మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాలను కలిపి జిల్లాగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఈ పాటికే సర్వే చేపట్టింది. దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు, తాళ్లూరు మండలాలు ఒంగోలు రెవెన్యూ డివిజన్లో ఉన్నాయి. తమకు దగ్గరగా ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు ఉన్నందున ముండ్లమూరు, తాళ్లూరు మండలాలను ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని ఇక్కడి ప్రజలు, అఖిల పక్ష నేతలు పట్టు పడుతున్నారు. ఈ పాటికే అక్కడి ప్రజలు, నాయకులు వీటిపై ప్రభుత్వానికి అర్జీలు సమర్పించారు. ఈ రెండు మండలాల్లో అన్ని పార్టీల నాయకులూ ఇదే డిమాండ్‌ను వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి అభిప్రాయాలివీ..

'మార్కాపురం'లో కలిపితే ఇబ్బందులు

కూరపాటి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు, ముండ్లమూరు

ముండ్లమూరు మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలి. మార్కాపురం జిల్లాలో కలిపినట్లయితే ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున మండలాన్ని ఒంగోలులోనే కొనసాగించాలి.

'ప్రకాశం'లోనే కొనసాగించాలి

చింతా శ్రీనివాస్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు, ముండ్లమూరు

ముండ్లమూరు మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలి. గతంలో దర్శి తాలూకా నెల్లూరు జిల్లాలో ఉండేది. ప్రకాశం జిల్లా ఏర్పాటు చేసిన తర్వాత తాళ్లూరు సమితిని మూడు మండలాలుగా విభజించారు. తాళ్లూరు, ముండ్లమూరు మండలాలను ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలి.

'ఒంగోలు'లో ఉంటేనే సౌలభ్యం

వెల్లంపల్లి ఆంజనేయులు, సిపిఎం మండల కార్యదర్శి, ముండ్లమూరు

ముండ్లమూరు మండలం ఒంగోలు రెవెన్యూ డివిజన్లో ఉన్నందున కొత్తగా ఏర్పాటు చేయబోయే మార్కాపురం జిల్లాలో కలుపవద్దు. ప్రకాశం జిల్లాలోనే ఉంచాలి. ప్రకాశం జిల్లాలో ఉంటేనే ముండ్లమూరు ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది.

మార్కాపురం.. 80 కిలోమీటర్ల దూరం..

సుంకర అంజిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి, ముండ్లమూరు

ముండ్లమూరు మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలిపితే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇక్కడ నుంచి 80 కిలోమీటర్ల దూరం ఉన్నందున ప్రయాణం ఎక్కువ సమయం తీసుకుంటుంది. అందువల్ల ముండ్లమూరును ప్రకాశం జిల్లాలోనే ఉంచాలి.

ఒంగోలుకే దగ్గర..

తోట రామారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు, ముండ్లమూరు

ముండ్లమూరు మండలం ఒంగోలుకి దగ్గరలో ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రకాశం జిల్లాలోనే ఉంచాలి. మార్కాపురం జిల్లాలో కలపొద్దు..

తాళ్లూరును ప్రకాశం జిల్లాలోనే ఉంచాలి

మేడం వెంకటేశ్వరరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు, తాళ్లూరు

తాళ్లూరు మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలి. తాళ్లూరు నుంచి మార్కాపురం సుమారుగా 100 కిలోమీటర్లు ఉంది. ఒంగోలు అయితేనే దగ్గరగా ఉంటుంది. ప్రకాశం జిల్లాలోనే తాళ్లూరు మండలాన్ని ఉంచాలన్నది మండల ప్రజల అభిప్రాయం.

మార్కాపురం చాలా దూరమవుతుంది..

తూము సుబ్బారెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు, తాళ్లూరు

తాళ్లూరుకు మార్కాపురం జిల్లా చాలా దూరం. ఒంగోలే దగ్గరగా ఉంటుంది. అందువల్ల ప్రకాశం జిల్లాలో తాళ్లూరును ఉంచాలి. ఇది నా వ్యక్తిగత అభిప్రాయంతో పాటు మండలంలోని పార్టీ నేతలు మొత్తం ఇదే అభిప్రాయంతో ఉన్నారు.

అందరి అభిప్రాయాలూ తీసుకోవాలి

మారం వెంకట కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, దర్శి

దర్శి నియోజకవర్గంలోని దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలను ప్రకాశం జిల్లాలోనే ఉంచాలి. ఈ మూడు మండలాలకు ప్రకాశం జిల్లానే సరైనది. ప్రభుత్వం అందరి అభిప్రాయాలనూ సేకరించి.. సరైన నిర్ణయం తీసుకోవాలి.

సుంకం రద్దు నిర్ణయం..

పత్తి రైతుల ప్రయోజనాలపై భారీ దెబ్బ

రైతు సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై విధిస్తున్న సుంకాన్ని రద్దు చేయడం పత్తి రైతుల ప్రయోజనాలపై పెద్ద దెబ్బగా మారిందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మాదాల నారాయణస్వామి స్మారక భవనంలో గురువారం జరిగిన ఎస్‌కేయం సమావేశంలో రంగారావు మాట్లాడారు. పత్తి రైతుల కష్టాన్ని పట్టించుకోకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి దిగుమతులపై సుంకాలు రద్దు చేస్తే దేశీయ పత్తి రైతులకు గట్టి నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.10,075గా నిర్ణయించి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో

సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రంగారావు

రైతు సంఘాలు తదుపరి కార్యాచరణను ఖరారు చేశాయి. ఆగస్టు 30, 31 తేదీల్లో మార్కాపురం డివిజన్, దర్శి నియోజకవర్గంలోని తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో విస్తత ప్రచారం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

సెప్టెంబర్ 1న మార్కాపురం ఆర్డీవో కార్యాలయం, సెప్టెంబర్ 2న ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టాలని నిర్ణయం చేశారు. రైతు సంఘాలన్నీ ఐక్యంగా పోరాడి ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, రైతు సంఘం (ఎల్ బిజి భవన్)జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. వీరారెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. లలిత కుమారి, ఎఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కె. హనుమంతరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్. మోహన్, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య, నాయకులు ఎన్ . హనుమంతరావు, పరిటాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు' మనుగడ సాధ్యమేనా.?

- ప్రాచీన భాషను విస్మరిస్తున్న ప్రజలు
- కార్యాలయాల్లో పూర్తిస్థాయి అమలు కాని మాతృభాష
- నేడు మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పాశ్చాత్య పోకడలు, ప్రపంచీకరణ నేపథ్యంలో మన మాతృభాష అయిన తెలుగు పట్ల చిన్నచూపు కనబడుతోంది. కార్యాలయాలలో దస్త్రాలు తెలుగులోనే ప్రచురించాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా పూర్తి స్థాయిలో అమలు కావట్లేదు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

గ్రాంథిక భాష పదబంధాలలో చిక్కుకున్న తెలుగు భాషను వాడుక భాషగా తీర్చిదిద్దారు వాడుక భాషోద్యమ పిడుగు గిడుగు రామమూర్తి. పండితులకు మాత్రమే పరిమితమైన తెలుగు భాషను పామరులకు సైతం చేరువ చేసి నిరక్షరాస్యతతో మగ్గిపోతున్న జాతిలో అక్షరాస్యత శాతాన్ని పెంచిన దార్శనికుడు ఆయన. అడవుల్లో నివాసం ఉంటూ మాట్లాడుకునే సవర భాషకు లిపిని సృష్టించి వారి జీవితాలలో వెలుగులు నింపిన వేగుచుక్క గిడుగు. అంతరించిపోతున్న తెలుగు భాషను పరిరక్షించుకోవ డానికి ప్రతి ఒక్కరు గిడుగు రామ్మూర్తి పంతులుని ఆద ర్శంగా తీసుకోవాలి. పరాయి భాషను గౌరవిస్తూనే తెలుగుకు సమున్నతమైన స్థానాన్ని కల్పించాలి.

కంకణబద్ధులు కావాలి

పొన్నూరు వేంకట శ్రీనివాసులు,
ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు

గిడుగు రామ్మూర్తి పంతులును ఆదర్శంగా తీసుకొని తెలుగు భాషా పరిరక్షణకు కంకణ బద్ధులు కావాలి. మాతభాషను నేర్చుకోవడం ద్వారానే మానసిక వికాసం కలుగుతోంది. పరాయి భాషలను గౌరవిస్తూనే అమ్మ భాష తెలుగుకు సమున్నతమైన స్థానాన్ని కల్పించాలి. అదే గిడుగు రామ్మూర్తి పంతులుకి మనమిచ్చే నిజమైన నివాళి.

తెలుగు పద్యాలు పిల్లలకు నేర్పాలి

తేళ్ల అరుణ, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు

తెలుగు పద్యాలను పిల్లలకు తల్లిదండ్రులు నేర్పాలి. మాతభాష మాత్రమే పరిసరాల అనుభూతుల్ని అనుభవించగలిగేలా చేస్తోంది. ఇంగ్లీష్, ఇంకో భాష వద్దని నరసం చెప్పదు. మాతభాష మాత్రం తప్పనిసరిగా ఒక సబ్జెక్టుగా ఉండి వారు అన్ని పుస్తకాలు గ్రంథాలు చదవగలిగే పరిజ్ఞానం తెలుగులో ఉంటేనే వారిని మిగతా పరీక్షల్లో ఉత్తీర్ణులు చేస్తామనే ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి రావాలని కోరుకుంటున్నాం. తమ పోరాటం ఫలితంగా కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వటం సంతోషంగా ఉంది.

రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటుచేస్తాం..

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని లంకోజనపల్లి పంచాయతీ, జగనన్న కాలనీలో త్వరలో రోడ్లతో పాటు వీధిలైట్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని జిల్లా హౌసింగ్ శాఖ ప్రధాన అధికారి శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఈ నెల 25న ప్రజాశక్తిలో 'రూ.10 కోట్ల ఖర్చు.. ఒకే కుటుంబమే నివాసం' శీర్షికన ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. లబ్ధిదారులు అక్కడ నివాసం ఉండేందుకు అన్ని వసతులూ మున్సిపాలిటీ ద్వారా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సబ్సిడీపై డ్రోన్ పంపిణీ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం దిగువమెట్ట తాండ గ్రామంలో గురువారం శ్రీ రామ కిసాన్ డ్రోన్ ఎఫ్‌యంబి గ్రూప్ కి వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం శాతం సబ్సిడీ పై డ్రోన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునిక సాంకేతిక వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. పంటల సాగుకు సమయం, కూలీల కొరత, పెట్టుబడి ఖర్చులు తగ్గించడానికి డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

'డీఎస్సీ' సర్టిఫికెట్ వెరిఫికేషన్ పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు రూరల్ మండల పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలోని శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో జరుగుతున్న డిఎస్సి-2025 సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియను గురువారం ఉదయం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభ్యర్థుల భవిష్యత్తు దష్ట్యా సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి పత్రాన్ని సక్రమంగా తనిఖీ చేసి, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. తప్పిదాలకు తావివ్వకుండా ఖచ్చితమైన రీతిలో పనులు కొనసాగాలని ఆయన సూచించారు. జాయింట్ కలెక్టర్ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ తెహరా సుల్తాన్,జిల్లా విద్యాశాఖాధికారి ఎ కిరణ్ కుమార్, విద్యాశాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరులు ఏసుపాదం మృతి

పలువురు సిపిఎం నేతల నివాళి

ప్రజాశక్తి - కొల్లూరు

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, తోకలవానిపాలెం సర్పంచ్ టి కృష్ణమోహన్ తండ్రి తురిమెళ్ళ ఏసుపాదం కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తన స్వగ్రామంలో తురిమెళ్ళ ఏసు పాదం మృత దేహాన్ని సందర్శించి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి, పి నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏసుపాదం సిపిఎం సానుభూతిపరునిగా కొనసాగుతూ తన కుమారుడు టి కృష్ణమోహన్‌ను సిపిఎం వైపు నడిపించడంలో కృషి చేశారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ తమ తండ్రి మృధు స్వభావని, గ్రామంలో ఎవరితోనూ వ్యక్తిగతంగా స్నేహంగా ఉండేవాడని తెలిపారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మణిలాల్, సిపిఎం చీరాల కార్యదర్శి ఎన్ బాబురావు, సిపిఎం జిల్లా నాయకులు పి కొండయ్య, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూధన ప్రసాద్, సిపిఎం నాయకులు డాక్టర్ చలం, సిపిఎం వేమూరు కార్యదర్శి బి అగస్టీన్, కొల్లూరు కార్యదర్శి వేములపల్లి వెంకట రామయ్య, టి సురేష్, బొనిగల సుబ్బారావు, బిఎల్‌కె ప్రసాద్, పి నాగమల్లేశ్వరరావు, బట్టిప్రోలు కార్యదర్శి సుధాకర్, దీపాల సత్యనారాయణ, మనోజ్, నాగరాజు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు డి రమాదేవి, నరసింహారావు, సిహెచ్ గంగయ్య

క్రికెట్ ఆడుతూ స్టేడియం ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

ఇండోర్ క్రీడా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్రంలో క్రీడలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అర్బన్, సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఔత్సాహిక క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శింగరకొండ రోడ్డులోని హిట్ జోన్ ఇండోర్ క్రీడా కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. నెట్ క్రికెట్‌తో సహా, షటిల్, ఇతర ఇండోర్ గేమ్స్ కోసం అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దిన హిట్ జోన్ సెంటర్‌ను ప్రజలు, యువతీ యువకులు, క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హిట్ జోన్ నిర్వాహకులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'సెయింట్ ఆన్స్'లో శిక్షణ

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సేల్స్ ఫోర్స్ టూల్‌పై ట్రైనింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. సిఎస్ఇ ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. క్లౌడ్ కంప్యూటింగ్‌లో భాగమైన సేల్స్ ఫోర్స్ టూల్‌పై హైదరాబాద్‌కు చెందిన నెక్సట్ జెన్ స్కాలర్స్ ప్రవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సిఎస్ఇ విభాగాధిపతి పి హరిణి తెలిపారు. నెక్సట్ జెన్ స్కాలర్స్ ప్రవేట్ లిమిటెడ్ తరపున జె వంశీకృష్ణ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిటెక్ 4వ సంవత్సరం విద్యార్థులు, కన్వీనర్ శేషసాయి పాల్గొన్నారు.

నగదు అందజేస్తునన విఎస్ఎన్ మూర్తి

పేద విద్యార్థులకు ఉపకార వేతనం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో చీరాలకు చెందిన రామకృష్ణ సేవా సమితి సెక్రటరీ విఎస్ఎన్ మూర్తి, హెచ్ఎం దేవరకొండ సరోజిని విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంచేందుకు ఉపయోగపడే 'స్వామి వివేకానంద జీవిత సందేశం' పుస్తకాలు గురువారం ఆవిష్కరించారు. 100 మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించారు. రామకృష్ణ సేవా సమితి ఐదుగురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున రూ.7500 ఉపకార వేతనం అందజేశారు. ఉమ్మిటి వేణుగోపాలరావు, కారంపూడి మధు, కె సరళదేవి, ఎస్ వసుధ కుమారి, పి సుధారాణి, జరుబుల శ్రావణి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి మార్టూరు రూరల్

బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు దేగరమూడి సర్పంచి జంపని వీరయ్య చౌదరి ముందుకు రావడం అభినందనీయమని ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు, తుల్లిబిల్లి అశోక్ బాబు అన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పులిపాటి సుబ్బారావు, మైలా చిన్న నాగేశ్వరావు పాల్గొన్నారు.

విహెచ్‌పిఎస్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - అద్దంకి

మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసి అనేక పోరాటాల ఫలితంగా హక్కులు సాధించుకున్నట్లు ఎంఆర్‌పిఎస్ నాయకులు పూనూరి నరేంద్ర అన్నారు. 18ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూనూరి రమేష్, పూనూరి నేహేమియా, పాలెపోగు సుబ్బారావు, దాసరి బుల్లయ్య పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ సుజల పథకం ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని జార్లపాలెంలో ఎన్టీఆర్ సుజల రక్షిత మంచినీటి పథకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ప్రారంభించారు. అనంతరం రూ.కోటితో నిర్మించనున్న జార్లపాలెం, చెరువుకొమ్ముపాలెం తారు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.20లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీరోడ్లు, సైడ్ డ్రైన్లు, అద్దంకి, కొణికి రోడ్డు నుంచి దాసుల కాలనీ వరకు రూ.30 లక్షల విలువైన సిసి రోడ్డు ప్రారంభించిన అనంతరం 35 మంది లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15నెలల్లో అభివృద్ధి అంటే ఏంటో కూటమి ప్రభుత్వం చూపించిందని అన్నారు. పింఛన్‌ను రూ.2వేలు నుంచి రూ.3వేలు చేయడానికి జగన్‌కు 5ఏళ్లు పట్టిందని, కానీ చంద్రబాబు నాయుడు ఒక్క సంతకంతో పింఛన్ రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచినట్లు చెప్పారు. పింఛన్లపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అర్హులైన దివ్యాంగులకు పింఛన్లను ప్రభుత్వం ఎక్కడా తొలిగించలేదని అన్నారు. రూ.33వేల కోట్లతో రాష్ట్రంలో 65లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం పింఛన్ల కోసం ఇంత పెద్దఎత్తున ఖర్చు చేయడం లేదని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈపాటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీ శక్తి వంటి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించినట్లు తెలిపారు. మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీతో పోస్టులు భర్తీ చేస్తున్నామని అన్నారు.

ఎన్టీఆర్ సుజల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

వికలాంగుల పింఛన్లపై అసత్య ప్రచారం

ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ల విషయంలో వైసీపీ నేతలు అసత్యం చెబుతూ విష ప్రచారం చేస్తున్నారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న రోడ్లను ప్రారంభించారు. జగన్ ప్రభుత్వంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అమలు చేయకుండా వదిలేశారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు. దివ్యాంగుల పింఛన్ల విషయంలో అసలైన లబ్ధిదారులకు నష్టం కలిగేలా వైసిపి నేతలు అసత్యాలతో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పింఛన్లపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన దివ్యాంగులు ఎవరికీ పింఛన్లు ఆగలేదని, ఎవరివీ తొలగించలేదని స్పష్టం చేశారు.

జనాభా ఆధారంగా రిజర్వేషన్ పెంచాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు ఆధ్వర్యంలో కుప్పం నుండి ఇచ్చాపురం వరకు చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర గురువారం మార్టూరు చేరుకుంది. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని, రాజ్యాంగానికి భిన్నంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునసమీక్షించుకోవాలని కోరారు. మైలా చిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు సన్నాహకంగా ర్యాలీ, మాలల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తుల్లిబిల్లి అశోక్ బాబు, డాక్టర్ దాసరి చెన్నకేశవులు మాట్లాడారు. సభకు బత్తుల రోశయ్య అధ్యక్షత వహించారు. 42లక్షల మందిగా ఉన్న తమ ఓట్లు వాడుకుని వదిలేస్తున్న పార్టీలకు ఓటుతోనే బుధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి విజయమ్మ, శ్రీనివాసరావు, సాతులూరి భాస్కర్, కుల్లి పిచ్చయ్య, సాతులూరి రమేష్, ఎం రవి, బి అశోక్, యద్దనపూడి మాజీ జెడ్‌పిటిసి బత్తుల శారమ్మ, జాన్ నెహ్రు, పెదభూషణం పాల్గొన్నారు.

యద్దనపూడిలో మాట్లాడుతున్న తుల్లిబిల్లి అశోక్‌బాబు


ప్రమాణ స్వీకారం చేస్తున్నసొసైటీ ఛైర్మన్ నరేంద్ర

సొసైటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అన్నంబోట్లవారి పాలెం సొసైటీ ఛైర్మన్‌గా గ్రామానికి చెందిన అప్పలనేని నరేంద్ర గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అడుసుమల్లి సొసైటీ ఛైర్మన్ పోపూరి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, వీరన్నపాలెం మాజీ సర్పంచ్ మక్కెన శేఖర్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు షేక్ సంశుద్దీన్, కార్యదర్శి, దేవరపల్లి ఉపసర్పంచి కొరిటాల సురేష్, దేవరపల్లి ఎంపీటీసీ కాపు రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గుంటుపల్లి భద్రయ్య, బి వీరయ్య, ఎ వెంకట్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చేస్తున్న రోటరీ ప్రతినిధులు

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పర్చూరు

వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో 3వ సంవత్సరం చదువుతున్న కుంచాల శ్రీఓంకార్ అనే విద్యార్థికి బస్సు ఫీజు నిమిత్తం ప్రతి ఏటా లాగానే రూ.15వేల ఆర్థిక సహాయంను రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ చేతుల మీదగా గురువవారం అందజేశారు. కార్యక్రమంలో కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, కారుమూడి సుబ్బారెడ్డి, మున్నంగి వెంకటసుబ్బయ్య, పాబోలు వెంకటేశ్వర్లు, కాసా అశోక్ కుమార్, గడ్డిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్లలో మార్పులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

వికలాంగుల పెన్షన్ల పంపిణీలో సెప్టెంబర్ నుండి కొన్ని మార్పులు చేసినట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. రీ వెరిఫికేషన్‌లో 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన వారందరికీ యధావిధిగా రూ.6వేలు, అనర్హులుగా తేలిన 60ఏళ్లు నిండిన 92 మందికి వృద్ధాప్య పెన్షన్ రూ.4వేల చొప్పున పెన్షన్ అందజేయనున్నట్లు తెలిపారు. సదరం రివెరిఫికేషన్‌లో అనర్హులుగా గుర్తించబడిన 18ఏళ్లు నిండిన ఆరుగురు వితంతు మహిళలకు వితంతు పెన్షన్ రూ.4వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

క్షయవ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి

మేదరమెట్ల పిహెచ్‌సి పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో క్షయ వ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికృష్ణ మాట్లాడారు. వ్యాధి లక్షణాలు కలవారు క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ టి రాజశేఖర్, ఎంఎల్‌హెచ్‌పి, పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా మహాసభలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి కమల

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా కార్యకర్తలకు కనీస వేతనం చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని 14 నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదని ఆశా వర్కర్ల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కోశాధికారి ఎ కమల అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన యూనియన్ జిల్లా ద్వితీయ మహాసభలో ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్లు పని చేయటానికి నాణ్యమైన ఫోన్స్ ఇవ్వలేదని అన్నారు. ఆశా కార్యకర్తలకు సెలవులు ఇవ్వటం లేదని అన్నారు. గత ఒప్పందాల్లో లిఖిత పూర్వకంగా ఇచ్చిన ప్రకారం దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వాలని అన్నారు. ఎన్‌హెచ్‌ఎం విధుల ప్రకారం ఆశా నియమకాలు చేపట్టాలని అన్నారు. పెరిగిన పనిభారంకు తగిన వేతనాలు పెంచాలని కోరారు. ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలు, పసిపిల్లలు, పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని అన్నారు. మాతా, శిశు సంరక్షణలో ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషిస్తున్నా రని అన్నారు. ఆశా కార్యకర్తలు కరోనా కాలంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ప్రపంచ ఆరోగ్య సంస్థ చేత ప్రశంశలు అందుకున్నారని అన్నారు. టిబి, లెప్రసీ,ఎయిడ్స్ వంటి జబ్బులకు, ఇతర కాలానుగుణ వ్యాధులకు సేవలు అందించడమే గాక రకరకాల సర్వేల పేరుతో ప్రతిరోజు ఇంటింటికి తిరుగుతూ ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులతో పనిభారాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. బీపీ, షుగర్, హార్ట్ ఎటాక్ వంటి ఆనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ఆశా కార్యకర్తలతో గొడ్డుచాకిరి చేయిస్తున్న ప్రభుత్వాలు జీతాలు పెంచి ఆరేళ్లవుతుందని అన్నారు. ఈ కాలంలో నిత్యవసర సరుకుల ధరలు, విద్య, వైద్యం ఖర్చులు, కరెంటు బిల్లులు, ఇతర పన్నులు విపరీతంగా పెరిగాయని, ప్రస్తుతం ఉన్న ఆదాయం కుటుంబ అవసరాలకు చాలక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాటం చేయాలని అన్నారు. తొలుత సిఐటీయు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్మిక రంగంలో చనిపోయిన మృతులకు సంతాపం తెలిపారు. ఆశా కార్యకర్తల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. మహాసభలో ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షులు డి ధనలక్ష్మి, కార్యదర్శి ఎం వెంకటేశ్వరమ్మ, నాయకులు కృష్ణవేణి, ఎం రాజకుమారి, బి ఝాన్సీలక్ష్మి, ధనమ్మ, వాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆశా యూనియన్ రాష్ట్ర కోశాధికారి కమల

కృష్ణ నది ఉధృతి పరిశీలిస్తున్న తహశీల్దారు శ్రీనివాసరావు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

కృష్ణ నది పరివాహాక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు అన్నారు. కృష్ణ నదీ పరివాహాక ప్రాంతాలైన పెనుమూడి, పల్లిపాలెం గ్రామాలను ఆయన సందర్శించారు. కృష్ణ నది ఉధృతి పరిశీలించారు. కృష్ణా నదికి ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో 69 గేట్లు ఎత్తినందుకు నదిలో నీటి ప్రవాహం ఉదృతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. పిల్లలు సరదాగా ఈత కొట్టడానికి, సెల్ఫీ దిగడానికి వెళ్లరాదని చెప్పారు. రైతులు నది పక్కన పొలాల్లోని విద్యుత్ మోటర్లను బయటకు తెచ్చుకోవాలని చెప్పారు. పశువులు, మేకలు, గొర్రెలను పొలాల నుంచి ఇళ్లకు తరలించుకోవాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని చెప్పారు. వలలు సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితి ఏర్పడితే 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రాంబాబు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - ముండ్లమూరు

లక్ష్మి చంద్రకళ

మండలంలోని కెజిబివిలో 14 ఏళ్లుగా తెలుగు సీఆర్టీగా పనిచేస్తున్న దివి లక్ష్మీ చంద్రకళ ఇటీవల విడుదలైన ఎపి మెగా డీఎస్సీలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక అయ్యారు. 3వ జోన్‌కు చెందిన తెలుగు టిజీటీ పోస్టుకు ఎంపిక అయ్యారు. జూన్ 2025లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ) నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత పొందారు. పీహెచ్డీ అర్హత పొందారు. ఈ విజయాల వెనుక తన భర్త డాక్టర్ దారా విద్యాసాగర్ బాబు, తల్లి, దండ్రుల ప్రోత్సాహం ఉందని చెప్పారు.

కన్వెన్షన్ హాలు ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని మధురానగర్‌లో నూతన కన్వెన్షన్ హాలును మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు గురువారం జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. వినియోగదారులకు మంచి సేవలు అందించి పేరు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కన్వెన్షన్ హాల్ యాజమాన్యం, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవసరానికి మించి యూరియా కొనొద్దు

చీరాలలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌టిఎల్ ఎఒ సుమతి

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని గవినివారిపాలెంలో ఆత్మ ఆధ్వర్యంలో భూసార పరిరక్షణపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌టిఎల్ ఎఒ ఐ సుమతి మాట్లాడారు. భూసార పరిరక్షణకు వచ్చిరొట్ట పంటలు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మ బిటిఎం జ్యోతి, మనీషా పాల్గొన్నారు.

కర్లపాలెం : రైతులు యూరియాను అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని ఎఒ సుమంత్ కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు పామిడి భాస్కరరావు, ఎఇఒ భాగ్యలక్ష్మి, విఎఎ శివ కృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

అద్దంకి : నానో యూరియాతో పంటలకు మేలు జరుగుతుందని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ చాందిని, ఎఇఒ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని ఎరువులు షాపులను డిప్యూటీ తహశీల్దారు ఎన్ శ్రీనివాసరావు, ఎఒ వి నరేంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గురువారం తనిఖీ చేశారు. ఈపాస్ మిషన్‌లో ఉన్న స్టాకు రిజిస్టర్లో ఉన్న టాకు, ఎరువుల స్టాక్ రిజిస్టర్ బోర్డును పరిశీలించారు. ఎవరైనా ఎరువులు ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఇఒ ఎన్ వంశీ, విఆర్ఓ రామారావు పాల్గొన్నారు.

రేపల్లె : ఖరీఫ్‌లో సాగు చేసి పంటలన్నింటికీ ఈ పంట నమోదు చేయాలని ఎఒ ఎ మహేష్ సూచించారు. మండలంలోని తుమ్మల, మోళ్ళగుంట గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న రేపల్లె ఎఒ మహేష్

ఎంపిడిఒలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

సుస్థిర అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి - బాపట్ల

సుస్థిర ఆర్థిక అభివృద్ధి సాధన దిశగా సామాజిక న్యాయం సాధించడానికి ప్రణాళిక తయారు చేయాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ డి వెంకట్రావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణ ఉమ్మడి జిల్లాల ఎంపిడిఒలకు రెండు రోజుల ఓరియంటేషన్ శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో అందుబాటులో ఉన్న ఆర్థిక, సామాజిక మానవ వనరులతో పారదర్శకంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ లలిత, ఎన్ఐఆర్డి సీనియర్, కన్సల్టెంట్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన శిక్షణలో 48 మంది ఎంపిడిఒలు పాల్గొన్నారు.

కోడిపుంజుల చోరీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొప్పరం నెహ్రు నగర్ కాలనీలో పూల రాముకు చెందిన కోళ్ల పెంపకం కేంద్రంలోని 15 కోడి పుంజులు చోరీకి గురయ్యాయి. రూ.6లక్షల విలువ ఉంటుందని బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుని వివరాల ప్రకారం నెహ్రునగర్ కాలనీలో 6నెలలుగా తన ఇంటి పరిసరాల్లో తూర్పుకోళ్ల పెంపకం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో 15 కోడిపుంజుల తోపాటు 15 జాతి కోడి పెట్టలు, 40 కోడి పిల్లలు ఉన్నాయి. బుధవారం రాత్రి వర్షం కారణంగా తాను ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు కోళ్ల పెంపకం కేంద్రానికి అడ్డుగా ఉన్న ఇనుప గేటు తొలగించి అందులో ఖరీదైన కోడిపుంజులను చోరీ చేశారని పిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం ఉదయాన్నే కోళ్ల పెంపకం కేంద్రం వైపు చూడగా కోడి పుంజులు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఆనందబాబు

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని అమృతలూరుకు చెందిన గరికపాటి నాగేశ్వరరావు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. వైద్యానికైన ఖర్చులు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఫార్సు ద్వారా సిఎం సహాయ నిధికి పంపారు. సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2లక్షలకు సంబంధించిన ఎల్ఒసిని బాధితుని కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందజేశారు.

వికలాంగులకు జరిగిన వివాహ చిత్రం

వికలాంగుల ప్రేమ వివాహం

ప్రజాశక్తి - బాపట్ల

కులాలు వేరైనా ప్రేమించుకున్న ఇద్దరు వికలాంగులు పట్టణంలో గురువారం వివాహం చేసుకున్నారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ప్రాంతంలో వికలాంగుల విభాగం విభాగం నాయకుడు చల్లా రామయ్య వీరిద్దరికి వివాహం జరిపించారు. పర్చూరు మండలం గొల్లపూడికి చెందిన దివ్యాంగుడైన బొట్టు గంగాధర్, ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన దివ్యాంగురాలు బడుగు శిరీష (సుందరమ్మ) ప్రేమించుకున్నారు. దివ్యాంగుడైన గంగాధర్ దివ్యాంగురాలైన శిరీషను పెళ్లి చేసుకునేందుకు గంగాధర్ సోదరుడు శ్రీనివాసరావు అంగీకరించకపోవడంతో బాపట్లలో చల్లా రామయ్య దివ్యాంగులైన వారిద్దరికీ వివాహాన్ని జరిపించి రక్షణ కల్పించాలని పోలీసులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు మల్లెల మౌనిక, షేక్ అమీర్ బాషా, ఎం నాయక్, ప్రకాష్, ఆనోది రామిరెడ్డి, ఆట్ల శ్రీనివాసులరెడ్డి, జోసఫ్, ఉష, డి రూబెన్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామస్థులు

బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని మణికేశ్వరం గ్రామానికి ఎపిఎస్‌ఆర్టీసీ సదుపాయం లేక వృద్ధులు, విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన టీడీపీ గ్రామ నాయకులు కరిముల్లా, కొంత మంది గ్రామస్తులు సమస్యను గత నెలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం అధికారులు మణికేశ్వరం గ్రామానికి నూతన బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించిన సందర్భంగా గ్రామస్తులు మంత్రి ఫ్లెక్సీలు చేతపట్టి కృతజ్ఞతలు తెలిపారు. సంతోషం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, రూబేను, రవి, ఆదినారాయణ, కాలేషా, రఘుబాబు, సుధాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయండి

జేసీని కోరిన ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ప్రజల చిరకాల వాంఛ ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు కోరారు. స్థానిక జెసి ఛాంబర్‌లో గురువారం ఆయనను మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డితో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒంగోలులో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎయిర్‌పోర్ట్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జెసిని కోరారు. అదేవిధంగా కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామం వద్ద ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు గతంలో ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కరించాలని జెసిని కోరారు. సానుకూలంగా స్పందించిన జెసి ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టారన్నారు. కొత్తపట్నం మండలంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుపై సమగ్ర సర్వే జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మార్కాపురం నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జేసీతో మాట్లాడుతున్న దామచర్ల

ప్రభుత్వ పనితీరుకు

మెగా డీఎస్సీ నిదర్శనం

- పారదర్శంగా బార్ల కేటాయింపు
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి - ఒంగోలు కల్టెరేట్

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్‌సి ప్రకటించి 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుండడం కూటమి ప్రభుత్వ పని తీరుకు నిదర్శనమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. 2019 ఎన్నికల సమయంలో రాష్ట్రంలో 2.50 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించి ఒక్క పోస్టు కూడా నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇవ్వలేదని విమర్శించారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆయన హెూటల్ కెబి రెస్టారెంట్‌లో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. తొలుత ఒంగోలు చేరుకున్న మంత్రి కొల్లు రవీంద్రకు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మెగా డిఎస్‌సిలో ఎక్కడా ఎలాంటి రిమార్కు లేకుండా పారదర్శకంగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్న ఘనత రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అన్ని సూపర్ హిట్ అయి రాష్ట్రమంతా ప్రజలు ఆనందంగా ఉంటున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. దేశంలోనే ఏ రాష్ట్రం ఇవ్వనంత పెన్షన్ 4000 దాదాపు 64 లక్షల మందికి అందిస్తున్నామన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంతో ముందుకెళ్తున్నామని అని ఆయన వివరించారు. బార్ లైసెన్స్ విషయంలో పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు. జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు, జిల్లా ప్రొహిబిషన్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్‌కె ఆయేషా బేగం, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

ఎర్రజెండా చేతబట్టి..

భూమి కోసం కదిలిన పేదలు

- కష్టజీవులకు భూములు దక్కేవరకు ఉద్యమిస్తాం
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

3ప్రజాశక్తి ముండ్లమూరు

సాగు భూముల సాధన కోసం వ్యవసాయ కార్మిక సంఘం అండతో ఎర్రజెండాలు చేతపట్టి భూములు దున్ని, విత్తనాలు చల్లి.. పేదలు సాగుకు సిద్ధమయ్యారు. ఆ భూముల్లో హక్కులు దక్కేవరకు, పంటలు చేతికొచ్చే వరకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోనీ జగత్ నగర్ ప్రాంతంలో 50 ఏళ్లక్రితం పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. కొద్దిమంది వ్యక్తులు ఈ పేదలను భయపెట్టి వారి భూముల్లోకి వారిని వెళ్ళనీయకుండా, అదిరింపులు, బెదిరింపులు, దాడులు, పోలీస్ కేసులు పెట్టి, అరెస్టు చేయించి, జైళ్ళ చుట్టూ తిప్పి అర్హులకు భూములు దక్కనీయకుండా చేశారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం అండతో నేడు పేదలంతా ఐక్యంగా ఆ భూముల్లోకి దిగి, భూములు దున్ని కంది విత్తనాలు చల్లుకున్నారని తెలిపారు. ఆ పంట వారి చేతికి వచ్చేవరకు భూములు మీద వారికి సంపూర్ణమైన హక్కు కలిగే వరకు వ్యవసాయ కార్మిక సంఘం వారికి వెన్నుదన్నుగా ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో పెద్ద సంఖ్యలో పేదల భూముల అన్యాక్రాంతమయ్యాయని, వాటిని పరిశీలించి అర్హులైన పేదలకు దక్కే వరకు వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందని తెలిపారు. మారెళ్ళ, గంగన్న పాలెం, జమ్ములమడక, పోలవరం, రాజగోపాల్ రెడ్డి నగర్, కంభంపాడు తదితర గ్రామాలలో ఈపాటికే అటువంటి పోరాటాలు సాగించి పేదలకు భూములు సాధించి పెట్టామని తెలిపారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన 60 ఎకరాల భూమిని ఈ గ్రామంలో ఒకే కుటుంబం అక్రమంగా సాగు చేసుకుంటున్నదని, అక్రమ పట్టాలు, పాస్ పుస్తకాలు పొంది పేదలను భయపెడుతున్నారని అన్నారు. ఆ భూమికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని వెలికి తీసి అధికారుల దష్టికి తీసుకెళ్లి అక్రమ పట్టాలు రద్దు చేయించి అర్హులకు హక్కు కల్పించేందుకు కృషి జరుగుతున్నదని తెలిపారు. అధికారులు కూడా పేదలకు అండగా ఉన్నారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు, రైతు సంఘం మండల కార్యదర్శి పంటా ఏడుకొండలు, సీనియర్ నాయకులు బోడపాటి హనుమంతరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కెవి పిచ్చయ్య తదితరులు మాట్లాడుతూ ఈ భూములు పేదలకు దక్కేవరకు అండగా ఉంటామని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గోగుల నారాయణ, పొట్లూరి రామాంజనేయులు, మండల నాయకులు ఎం దాసు, గాలి వెంకటేశ్వర్లు, మేకల హనుమంతరావు, పి సుబ్బారావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, పి. హనుమయ్య, వల్లపు అంజమ్మ, చల్లా సీతమ్మ, వి రంగనాథ్, నాగరాజు, జె రవి, ధన భాగ్యం, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

నిమజ్జన సమయంలో

ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి: ఎస్పీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో జరగబోయే వినాయక నిమజ్జన కార్యక్రమాలు సురక్షితంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు గురువారం ముఖ్య సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భక్తులు వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఉధతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకల్లో దిగరాదు. కల్వర్టులు, చప్టాలపై వరద నీరు పొంగి ప్రవహిస్తున్నప్పుడు వాటిని దాటే ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు. ఇటువంటి నిర్లక్ష్యం వలన ప్రాణాలకు ముప్పు కలిగే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ, పోలీసులు సూచించిన సురక్షిత ప్రదేశాల్లోనే వినాయక నిమర్జనాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు.

ఊరేగింపు సమయంలో పాటించవలసిన నియమాలు

వినాయక నిమజ్జన ఊరేగింపులు శాంతియుతంగా, సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవాలి.ఇతర మతాలు, వర్గాలు, వ్యక్తులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు, నినాదాలు, చేయరాదు. ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదు. ఊరేగింపులో ఉపయోగించే వాహనాలు మంచి కండిషన్లో ఉండాలి. వాటి వివరాలను ముందుగానే సంబంధిత పోలీసులకు తెలపాలి. మద్యం సేవించిన వారు ఊరేగింపులో, నిమజ్జన కార్యక్రమాల లో పాల్గొనకుండా కమిటీ సభ్యులే చూసుకోవాలి. నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదు. అసభ్యకర వేషధారణలు, నత్య ప్రదర్శనలు నిర్వహించరాదు. నిమజ్జన ప్రదేశంలో అధికారులు ఇచ్చే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి. పోలీసుల సూచనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉన్న, పోలీస్ శాఖ సహకారం అవసరమైన వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 112 కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఎస్పీ తుషార్ డూడి

అధునాతన సౌకర్యాలతో 'కురుగుంట్ల' హాస్పిటల్

ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక కొండపి రోడ్డులో ఒంగోలు, నెల్లూరు లాంటి జిల్లా కేంద్రాల్లో కూడా లేని అధునాతన నూతన పరికరాలు, ఆపరేషన్ థియేటర్లతో కురుకుంట్ల ఆశాలత మెమోరియల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను టంగుటూరులో ఏర్పాటు చేయటం కొండపి, సింగరాయకొండ, జరుగుమల్లి లాంటి ప్రాంతాల ప్రజలకు బాగా ఉపయోగపడుతుందని ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ అన్నారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ ఇన్కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె సిల్వన్ రాజు నిర్మించిన ఈ హాస్పిటల్లో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. హాస్పిటల్ ప్రధాన ఓపి విభాగాన్ని ఐసీయూ కన్సల్టెన్సీ క్యాబిన్లును దామచర్ల సత్య లాంచనంగా ప్రారంభించారు. లామినార్ ఆపరేషన్ ప్రధాన థియేటర్ ను ఉపాస హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ జి ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ కె అనిల్ కుమార్, డాక్టర్ ఏ శ్రీనివాసరావు, డాక్టర్ కె పవన్ కుమార్ ప్రారంభించారు, ప్రసూతి విభాగాన్ని జయంత్ బాబు, ఫార్మసీ విభాగాన్ని డాక్టర్ కె కష్ణారావు, జనరల్ వార్డును తన్నీరు లక్ష్మయ్య రాష్ట్ర బీసీ నాయకులు ప్రారంభించారు. అనంతరం వచ్చిన ప్రజలందరికి ఉచిత ఓపి ద్వారా వైద్యం మందులు అందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్ సీఈవో రిటైర్ ఐఆర్ఎస్ కె సిల్వన్ రాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో హాస్పిటల్ ప్రధాన వైద్యులు డాక్టర్ కె సువర్ణ రాజు, డాక్టర్ కె మౌనిక, డాక్టర్ ఎస్ ప్రణతి రాజ్, కురుకుంట్ల ఆశలత మెమోరియల్ ఫౌండేషన్ ఫౌండర్ కె స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్ ప్రారంభోత్సవంలో దామచర్ల సత్య